

# అలంకారం

## వి.ఎమ్.ఎస్. శాస్త్రి

ముప్ఫై నిముషాలుగా అద్దం ముందు కూర్చొని శిరోజాలంకరణలో ఉంది దమయంతి. సిగపాయ ముడికీ, జారు ముడికీ, తలకట్టుకూ, రెండు జడల వ్రేలాడింపుకూ మార్చి మార్చి చూస్తూన్నా సర్దుబాటు కుదరడంలేదు.

ఓ వంక చీరె సవరిస్తూనే ఉంది. చంద్రబింబంలాంటి ముద్దులొలికే మోముకు బొట్టు విషయానా డోలాయమానమే.

అద్దంలో తన రూపు తనకే ముద్దు గొలుపుతూంది. మనసైన ప్రియునికి ఇంకెలా తోస్తూందో...

అతను...

రాజనాల-

పేరులో ఎటూ 'రాజ' శబ్దం ఉండనే ఉంది. అందుకు తగ్గట్లే మూర్తీ, స్త్రీ హృదయాన్ని తేనెలో ముంచెత్తు సమ్మోహనం...

సిసలైన మగధీరుడు.

తనకు సరిజోడు.

వలచింది

వలపింప చేసుకుంది.

ఈ వేళ పబ్లిక్‌గార్డెన్స్‌లో కలవ




మన్నాడు.

'ఆ కలవడం దేనికీ?' తనడిగింది.

'తినబోతూ రుచులడగడం ఎందుకూ?'

'అదేదో చెబితే కాదంటానా? రానంటానా...' తను బుంగమూతి పెట్టింది. గింజుకున్నా, ముక్కోపం చూపినా లొంగాడు కాదు.

'వలరాజువే అనుకున్నా, మూర్ఖప్పట్టులోనూ శిఖామణివే...'

అంత జరిగినా అతనిపై కినుక వస్తేనా?

అదే అతని ఆకర్షణ.

తన బలహీనత.

'ఎందుకై ఉంటుందబ్బా ఈ వేళ రమ్మన్నదీ...' ఈ మాట శతానికి తక్కువకానన్ని మార్లు అనుకుంది.

తలపుల్లోనే తృప్తిమేర శిరోజాలంకరణ, బొడ్డు దిగువగా చీరెకట్టూ, తిలకం, అత్తరుపూత ముగిశాయి.

మనోవల్లభుని కలుసుకోవడానికి ఇంటి గడప దాటింది.

చేతులు సాచాడు ప్రియుడు.

'నన్నెందుకు రమ్మన్నావో ఇప్పటికైనా చెప్తావా...' అతను పెదవి మీద చేత్తో రాసింది తను.

'మరేంలేదూ! మా ఇంట్లో నాకు పెళ్ళిచేయాలని చూస్తున్నారు. ఎలాంటి పిల్లయితే నాకు ఒప్పుతూందో నిన్నడిగి తెల్సుకుందామనీ...'

కళ్ళింతలు చేసింది తను.

ఇన్నాళ్ళూ తనతో తిరిగిందీ, మరువలేని తీయని ఊసులాడిందీ, కౌగిళ్ళలో, ముద్దుల్లో మధురిమలెన్నో చవిచూపిందీ విలాసానికా? ఉబుసుపోకకా? ఔరా! మగబుద్ధెంత కుచ్ఛితం! స్వార్థపూరితం!'

కోపోద్వేగంతో యెద ఎగిసెగిసి పడుతుండగా 'యూ ఛీట్!' అంటూ అతన్ని దూరంగా విదిలించికొట్టింది.

'కూల్ డౌన్ బేబీ! యూ ఆర్ మై వుడ్ బీ? ఓ.కే. ఇప్పుడు నిన్ను మా ఇంటికి తీసుకెళ్తాను. ఎప్పుడో విధాత, నువ్వే నా భార్యగా రాసిపెట్టాడనీ, మీరు కాదన్నా, వివాదానికి దిగినా ఈమెను తప్ప వేరెవర్నీ చేసుకోననీ మా వాళ్ళతో బల్లగుద్ది మరీ నా నిర్ణయం తెలియచేస్తాను. అఫ్‌కోర్స్? నిన్ను చూస్తూనే మావాళ్ళు ఐసైపోతారనుకో. నాకా నమ్మకం ఉంది. కమాన్ లెటజ్ స్టార్ట్...' ఉడికించినంత సేపూ ఉడికించి, ఆనక అసలు శుభవార్త చెప్పి, తన నడుంచుట్టూ చేతులువేసి రాజ్‌దూత్‌ను సమీపించాడు రాజనాల.

అలా... దమయంతి స్వప్నం తీయగా కొనసాగింది. ఎటొచ్చీ ఇంకా శిరోజాలంకరణే ముగియలేదు. ఆ విషయంగానే-

'స్నానానికీ, అద్దం ముందు కూర్చొని వెనుకాముందూ- పక్కలూ చూసుకోడానికీ. మరీమరీ ప్రియుడు మెచ్చుకొనేలా తదితర ఆకర్షణలకూ ఇట్టే గంటలకు గంటలు తీసుకున్నా ఇంకా మొదట్లోనే ఉన్నానే-' తనపై తానే విసుక్కుంటూ- గబగబా తోచిన రీతిలో హేర్ స్టయిలూ, చీరెకట్టూ, తిలకం, అత్తరు పూత గట్రా గట్రా ముగించుకొని గడపదాటింది.

ఆసరికే ఆమెకోసం వేచిచూసీ, చూసీ ప్రియుని తల, గెడ్డం తెల్లబడిపోయింది. బుగ్గలూ, ఒళ్ళూ చప్పబడ్డాయి.

'నువ్వు రాజనాలలాగే ఉన్నావు. అతనికి కవలసోదరుడివా...' అదరా బాదరా అతన్ని సమీపించి విస్మయంగా ఒక్కడుగు వెనక్కేసింది దమయంతి.

నిజానికి అతని ఆనందం కోసం, తన అందచందాలు చాటుకోవడంకోసం స్త్రీ ప్రియపాత్రమైన ఆపాదమస్తక అలంకరణైనా-

ఆ క్షణాన ఆమెకు చెప్పి చూపిందా 'అతనే నీ ప్రియుడూ! నీకై నిరీక్షించీ, నిరీక్షించీ పాపం, ఇలా తయారయ్యాడూ...' అని.

అబ్బే!

అదెందుకు చెప్తుందీ?

తనమీద మోజుతో ఆడవాళ్ళు ఇట్టే కాలాన్ని యుగాంతాల దాకానైనా నెట్టేస్తూ; మగవాడి సంపాదనా, ఇబ్బందులతో నిమిత్తం లేకుండా ఎన్నో సంపాదాల్లో చిచ్చులు చూడడమంటే దానికెంత సరదానో!